



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ఈసారైనా.. పరిష్కారం దొరికేనా..?

- రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు తీరేనా..
- నేటి నుంచి రెవెన్యూ సదస్సులు
- వన్ బి కోసం పదేళ్లుగా నిరీక్షణ
- ఆఫీసుల చుట్టూ తిరుగుతూనే ఉన్న రైతులు
- పట్టించుకోని అధికారులు



మండలంలోని భూసమస్యలపై రైతులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న తహశీల్దార్ (ఫైల్‌ఫోటో)



రీసర్వేలో భూ సమస్యలు పరిష్కరించాలని తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు (ఫైల్‌పోటో)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రెవెన్యూ సదస్సుల్లో భాగంగా చిత్తూరు జిల్లాలోని 31 మండలాల్లో 782 రెవెన్యూ గ్రామాల్లో ప్రతిరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామంలో నిర్దేశించిన ప్రదేశాల్లో సదస్సులు నిర్వహించి ప్రజల దగ్గర వినతులు స్వీకరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ఇటీవల కాలంలో భూఆక్రమణలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రభుత్వ భూములను ఇష్టారాజ్యంగా ఆక్రమించుకుంటున్నారు. అధికారులు ఆక్రమణదారులతో చేతులు కలిపి భూముల రికార్డులను వారికి అనుకూలంగా మార్చేస్తున్నారు. సోమవారాల్లో జిల్లా సచివాలయం మండల కేంద్రాల్లో నిర్వహించే ప్రజావాణి ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాల్లో వచ్చే వినతుల్లో 70 నుంచి 80 శాతం వినతులు రెవెన్యూ శాఖకు సంబంధించినవే ఇందులో 90 శాతం భూవివాదాలే పరిష్కరించబడని సమస్యలను ఏళ్ల తరబడి సాగదీయడం రెవెన్యూ శాఖకు దక్కిన ఘనత...

ప్రజాశక్తి- యాదమరి: యాదమరి మండలం ఓటివారిపల్లి గ్రామ పంచాయతీకి చెందిన కొత్తూరు ఆది ఆంధ్రవాడ గ్రామంలోని నిర్మలకు 186 నడింపల్లి సర్వేనెంబర్ 366/2లో అప్పటి ప్రభుత్వం భూపంపిణీ కార్యక్రమంలో వారు అనుభవిస్తున్న భూమికి పట్టా మంజూరు చేసింది. 2014లో భూములను ఆన్లైన్‌లో నమోదు చేసే క్రమంలో వారి భూమి నమోదు కాలేదు. 2014 నుండి ఇప్పటివరకు వారి భూమి ఆన్లైన్‌లో నమోదు చేసుకోవాలని గత పది సంవత్సరాలుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతూనే ఉంది. అయినా ఇప్పటివరకు సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. ఆరు నెలల క్రితం జరిగిన ఈ సర్వేలో ఆన్లైన్లో నమోదైన వారికి సచివాలయం వన్ బి రావడం లేదు. వన్ బి కోసం ఎన్నిసార్లు కార్యాలయం చుట్టూ తిరిగినా యాదమరి రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాలేదు. తహశీల్దార్ కార్యాలయానికి, కలెక్టర్ కార్యాలయానికి తిరుగుతున్న క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు చేస్తాం.. చూస్తామని.. కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటూ కాలయాపన చేస్తున్నారు తప్ప ఆన్లైన్లో వన్ బి కోసం పది ఏళ్ల నిరీక్షణ ఇప్పటివరకు వారి భూసమస్య పరిష్కారం నోచుకోలేదు.

ఇది ఒక్క నిర్మల సమస్య మాత్రమే కాదు. మండలంలో ఇలాంటి సమస్యలతో ప్రతిరోజు కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నా రైతుల సంఖ్య అధికంగానే ఉన్నాయి. రెవెన్యూ శాఖలో రికార్డుల నిర్వహణలో చోటు చేసుకుంటున్న అక్రమాలు అధికారుల తప్పిదాలకు అనేకమంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తమ భూములను కాపాడుకోవడానికి రెవెన్యూ కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు.



వన్ బి కోసం 10 ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిర్మల

రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం నేటి నుంచి డిసెంబర్ 6 నుండి జనవరి 8వ తేదీ వరకు 33 రోజులపాటు చేపడుతున్న రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు పరిష్కారం కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్న రైతుల సమస్యలు పరిష్కారం దొరికేనా రైతుల దగ్గరకు క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్ష నుంచి వారి సమస్య పరిష్కరించే దిశగా రెవెన్యూ గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిష్కరించేందుకు ఏర్పాట్లు చేసింది. ఈ కార్యక్రమం ద్వారా ఈసారైనా ఆయా మండల పరిధిలోని రైతుల భూ సమస్యలకు పరిష్కారం దొరికేనా అంటూ రైతులు ఎదురుచూస్తున్నారు.

యాదమరి మండలంలో అధికసంఖ్యలో భూసమస్యలతో అనేకమంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే కార్యక్రమంలో ఒక 186 నడింపల్లి రెవెన్యూ గ్రామంలో రీసర్వే సమస్యల పరిష్కారం కోసం 131 దరఖాస్తులు అందాయి. దీన్నిబట్టి ఈసర్వేలో ఎంత మేరకు తప్పిదని చోటు చేసుకున్నది అర్ధమవుతుంది. రెవెన్యూలో క్షేత్రస్థాయి అధికారుల తప్పిదాల కారణంగా ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చిన రైతుల దరిచేరటం లేదు. యాదమరి తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సేవలు అందించడంలో ఇటు రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు, విలేజ్ సర్వే తీవ్రనిర్లక్ష్యం చేస్తూ రైతులను కార్యాలయాలు చుట్టూ తిప్పుకుంటూ వారి ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు స్పందించి రైతుల ప్రజలసమస్యలను పరిష్కారం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రైతుల కోరుతున్నారు.

భూ పంపిణీ రికార్డులు మాయం..

యాదమరి మండలంలో 2009-2014 మధ్యలో భూపంపిణీ కార్యక్రమం 5 విడత, 6 విడత,7 విడత కార్యక్రమంలో రైతులకు 741.61 ఎకరాల భూమిని పంపిణీ చేశారు. ఈ రికార్డులు యాదమరి తహశీల్దార్ కార్యాలయంలో కొంతవరకు మాత్రమే ఉన్నాయి. మిగిలిన రికార్డులు ఎక్కడున్నాయో రెవెన్యూ అధికారికి తెలియాల్సి ఉంది. రికార్డులు రెవెన్యూ కార్యాలయంలో అందుబాటులో లేక భూ పంపిణీలో ఇచ్చిన పుస్తకాలు చాలా వరకు భూములను ఆన్లైన్లో నమోదు చేసుకోలేకపోయారు. ఆన్లైన్లో లేకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిపొందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ రెవెన్యూ సదస్సులోనైనా తమ భూములను క్రమబద్ధీకరించి ఆన్లైన్లో నమోదు చేయాలని రైతులు కోరుతున్నారు.

రెవెన్యూ సదస్సులు పారదర్శకంగా నిర్వహించాలి

సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు



నేటి నుంచి జరుగుతున్న రెవెన్యూ సదస్సులు ప్రజలకు ఉపయోగపడే పద్ధతుల్లో పారదర్శకంగా నిర్వహించాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నెలరోజులు పాటు రెవెన్యూ సదస్సులు నిర్వహించడం మంచి పరిణామం అని అన్నారు. జిల్లాలో కూడా జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ ఇతర అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేయడం శుభపరిణామం అని, ప్రజలు అనేక సంవత్సరాలుగా భూ సమస్యలు పరిష్కారం కాకుండా రకరకాల ఇబ్బందులు పడుతూ ఆఫీసులు చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. పేదల భూములకు హక్కులు లేకుండా చాలా రకాల ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రతి సమస్యకు రాజకీయ రంగు పులవడం పరిపాటిగా మారిందని, ఈ సదస్సుల్లోనైనా ప్రజలు కోరుకుంటున్న భూ సమస్యలను జిల్లా పరిధిలో ఉన్న వాటిని జిల్లాలో అధికారులు పరిష్కారం చేయాలని కోరారు. జిల్లాలో అన్ని ప్రాంతాల్లో సిపిఎం కార్యకర్తలు రెవెన్యూ సదస్సుల సందర్భంగా ప్రజాసమస్యలను వినతిరూపంలో ఇవ్వనున్నారని తెలిపారు. నోడల్ అధికారులు ఇతర అధికారులు రాజకీయాలకు అతీతంగా ఈ సదస్సులు నిర్వహించి ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. ప్రజల ఆశలను అడియాశలు కాకుండా ఈ సదస్సుల్లోనైనా ప్రజలకు నమ్మకం కలిగించే విధంగా అధికార యంత్రాంగం పనిచేయాలని కోరారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

- భూ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత
- 7న మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ నిర్వహణ
- తల్లిదండ్రుల నుంచి సలహాలు సూచనల స్వీకరణ : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈనెల 6 నుంచి జనవరి 8వ తేదీ వరకు 33 రోజుల పాటు జిల్లాలో రెవెన్యూ సదస్సుల నిర్వహణ జరుగుతుందని, సమస్యలున్న ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో జిల్లాలో నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులు, మెగా పేరెంట్స్, టీచర్ మీటింగ్‌పై జిల్లా కలెక్టర్ పత్రికా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి గ్రామంలోనూ రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని, ఈకార్యక్రమంలో భాగంగా తహశీల్దార్‌లు, డిటిలు విఆర్‌ఓ, విలేజ్ సర్వేయర్లు రోజుకు ఒక గ్రామంలో గ్రామసభలు నిర్వహించి ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ప్రజలు దారి సమస్యలు, భూ సమస్యలు, రీ సర్వే సమస్యలు, జాయింట్ అకౌంటు సమస్యలు, డికెటి, ఎన్ హెచ్ సమస్యలకు సంబంధించి వినతులు సమర్పించవచ్చునన్నారు. రెవెన్యూ సదస్సులు పూర్తి అయిన 45రోజుల లోపు సమస్య పరిష్కారించబడుతుందని అన్నారు. కార్యక్రమం నిర్వహణకు సంబంధించి షెడ్యూల్ వివరాలను ప్రజాప్రతినిధులకు పంపడం జరిగిందని, ప్రజాప్రతినిధులు కూడా కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ప్రధానంగా రీసర్వే నిర్వహించిన గ్రామాల నుంచి అధిక వినతులు వచ్చే అవకాశం ఉంది, కార్యక్రమం మొత్తంలో 30 నుండి 40 వేల వినతులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అలాగే ప్రతి పాఠశాలలో డిసెంబర్ 7న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహణ, విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల పెంపునకు తల్లిదండ్రుల భాగస్వామ్యం ఎంతగానో తోడ్పడుతుందన్నారు. విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తు అందించడంలో తల్లిదండ్రులు భాగస్వామ్యం కావాలన్నారు. ఈనెల 7న జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించడం జరుగుతుందని, విద్యార్థి తల్లిదండ్రులు పెద్దఎత్తున కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమానికి విద్యాశాఖ అధికారులతో పాటు పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ శాఖల, సంక్షేమ శాఖల అధికారులు, జిల్లాస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొంటారన్నారు. పాఠశాలలకు మౌలిక సదుపాయాల కల్పన, భవనాలను ఏర్పాటు చేయడమైనదని, మెరుగైన ఫలితాలు సాధించవలసి ఉందన్నారు. విద్యార్థులకు అందిస్తున్న విద్యాబోధన, మధ్యాహ్న భోజన పథకం, తదితర అంశాలపై తల్లిదండ్రుల నుంచి సూచనలు స్వీకరిస్తామన్నారు. విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డు, ఆరోగ్య స్థితిగతులను కార్డు రూపంలో అందించడం జరుగుతుందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో డిఆర్‌ఓ కె.మోహన్ కుమార్, డీఈఓ వరలక్ష్మి, సమగ్ర శిక్ష ఏపిసి వెంకటరమణారెడ్డి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-సోమల



రాష్ట్రస్థాయి త్రో బాల్ పోటీలకు సోమల మండలం ఎస్ నడింపల్లి పంచాయతీ సూరయ్యగారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపిక అయినట్లు పాఠశాల హెచ్‌ఎం నిరంజన్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈనెల నాలుగవ తేదీన కుప్పం మండలం జెడ్పీ ఉన్నత పాఠశాల టి.సదుమూరులో ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో త్రో బాల్ అండర్ 17 ఎంపిక పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీలలో అండర్ 17 త్రో బాల్ విభాగంలో అత్యంత ప్రతిభ కనబరిచిన తమ పాఠశాల విద్యార్థులు 9వ తరగతి చదువుతున్న అనీషా, మహావిష్ణు వర్ధన్‌లు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు హెచ్‌ఎం తెలిపారు. ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైన ఈ విద్యార్థులు గుంటూరు జిల్లా మంగళగిరిలో త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు శివకుమార్ తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కందూరు విద్యార్థులు ఎంపిక అయినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట రమణారెడ్డి తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కందూరు విద్యార్థులు రెడ్డి పవన్ 9వ తరగతి, హేమలత, అంకిత పదవ తరగతి క్రీడాకారులు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు క్రీడల కార్యదర్శి చిన్నప్ప తెలిపారు. రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు సోమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు హరినాథ్ తెలిపారు. విద్యార్థులు ముబారక్ 9వ తరగతి, హేమనిధి 10వ తరగతి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు కరుణానిధి తెలిపారు. వీరిఎంపిక పట్ల ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. మరింత మంది ఇలాంటి ప్రతిభ కనపరిచాలని ఆకాంక్షించారు.



చెరువు కట్టను పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం పొదలకుంటపల్లి నంజంపేట మార్గమధ్యంలోని దలవాయి చెరువు కట్ట తూము వద్ద బుధవారం గండిపడి చెరువు కట్ట కొంతమేర కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మండలస్థాయి అధికారులు పరిశీలించి జిల్లా అధికారులకు సమాచారం అందజేశారు. కాగా గురువారం ఇరిగేషన్ అధికారులు తెగిన కట్ట ప్రాంతాన్ని పరిశీలించి అంచనా నివేదికను సిద్ధం చేసి తూము దృఢంగా నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తామని, సాధ్యమైనంత తొందరగా పనులు ప్రారంభిస్తామని తెలిపారు. అయితే పొదలకంటపల్లి నుండి లంజంపేటకు నిత్యం ప్రయాణించే విద్యార్థులు ఉద్యోగస్తులు ప్రజలు కట్టతెగడంతో రాకపోకలు నిలిచిపోవడంతో ఆర్ అండ్ బి వారు రోడ్డు డైవర్షన్ ఏర్పాటు చేసి రాకపోకలు కొనసాగించేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ విఎన్‌సి.గిరి, డీఈ కెవిఎన్.ప్రసాద్, జెఈ ఝాన్సీ, టిడిపి మండల అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, అష్రఫ్ పాల్గొన్నారు.



గండి పడి కొట్టుకుపోయిన కట్ట ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

ఉపాధ్యాయుడి మృతికి కారకులను శిక్షించాలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాయచోటిలో బుధవారం జరిగిన సంఘటనలో మరణించిన ఉపాధ్యాయులు ఇజాజ్ అహ్మద్ ఆత్మ శాంతించాలని, ఈ సంఘటనకు కారణమైన దోషులను శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఫ్యాప్టో నేతృత్వంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం, కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో సంఘ నాయకులు గంటా మోహన్, చంగల్‌రాయ మండడి, మదన్ మోహన్‌రెడ్డి, మునీర్ అహ్మద్, ముక్తార్ అహ్మద్, చంద్రన్, మధుబాబు, జగదీష్, పార్థసారథి, సుల్తాన్, దేవేంద్ర పాల్గొన్నారు.

విజయపురం (నగరి): అన్నమయ్య జిల్లా రాయచోటి కొత్తపల్లి ఉర్దూ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఇజాజ్ అహ్మద్ అనే ఉపాధ్యాయునిపై విద్యార్థులు దాడి చేసిన సంఘటనలో ఆయన మృతిచెందడం పట్ల ఫ్యాప్టో నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం రాష్ట్ర ఫ్యాప్టో పిలుపుమేరకు నియోజకవర్గ స్థాయిలోని ఉపాధ్యాయ సంఘ నాయకులు ఆర్డీవో కార్యాలయం వద్ద తమ నిరసన వ్యక్తం చేశారు. మృతిచెందిన ఉపాధ్యాయుని కుటుంబానికి న్యాయం చేయాలని, దాడికి పాల్పడిన వారిపై చర్యలు చేపట్టాలని ఏవోకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మృతి చెందిన ఉపాధ్యాయ కుటుంబానికి ఫ్యాప్టో అండగా ఉంటుందన్నారు. ప్రధానంగా పాఠశాల ఆవాస ప్రాంతంలో గుట్కా, గంజాయి సంస్కృతి ఉండటమే ఈదాడికి కారణంగా తెలుస్తోందన్నారు. ఈ విష సంస్కృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. బయట వ్యక్తులు పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులపై దాడి చేసిన సందర్భాలు చాలా ఉన్నాయన్నారు. ఈ సంస్కృతిని గాడిలో పెట్టాల్సిన ప్రభుత్వం తక్షణమే స్పందించాలని దోషులను శిక్షించాలని ఉపాధ్యాయుని కుటుంబానికి తగు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు పిఆర్ మునిరత్నం, జి.లక్ష్మీనారాయణ, జనార్ధన్, నాగభూషణం, సంతోష్ కుమార్, ఎస్.మహేంద్ర, సి.మోహన్, సుబ్రహ్మణ్యం, వెంకటేశులు, కుమార్ పాల్గొన్నారు.





- డీఈవోకి వినతిపత్రం అందిస్తున్న ఫ్యాప్టో నాయకులు - విజయపురంలో నిరసన తెలుపుతున్న ఫ్యాప్టో నాయకులు

అభివృద్ధికి ఆమడ దూరంలో గంగమాంబాపురం

- అధ్వానంగా పారిశుధ్యం
- రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు
- గ్రామం మధ్యలో పేడ దిబ్బలు

ప్రజాశక్తి- విజయపురం

మండలంలోని గంగమాంబాపురం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది.. ఈ గ్రామంలో సుమారు 100కు పైగా కుటుంబాలు ఉన్నాయి. అయితే ఇక్కడ కనీస వసతులు కూడా లేక స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో మొత్తం మూడు వీధులున్నాయి. అయితే ఏ ఒక్క వీధిలోనూ మురుగు నీటి కాలువలు లేదు. దీంతో వర్షాలు పడిన ప్రతిసారి సిమెంట్ రోడ్డుపై వర్షపునీరు నిలిచి రాకపోకలకు తీవ్రఇబ్బందిగా ఉంది. అంతేకాకుండా ద్విచక్ర వాహనాలదారులు సైతం వర్షపు నీటిలో జారి కిందపడి గాయాల పాలవుతున్నారు. అలాగే గ్రామాల్లో ఎక్కడ గాని వీధిలైట్లు సక్రమంగా వెలగడం లేదు దీంతో సాయంత్రం పూట స్థానిక ప్రజలు బయట రావడానికి భయాందోళనకు గురవుతున్నారు. అంతేకాకుండా గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది.



ఇంటి పరిసరాల్లో వర్షపు నీరు





ఊరి మధ్యలో పేడ దిబ్బలు

ఎక్కడికక్కడే మురుగు..

ఇటీవల ఫెంగల్ తుపాన్ కారణంగా మూడు రోజులు కుర్చున్న వర్షానికి సిమెంట్ రోడ్డుపై నీరు నిలిచింది. నీరు కదలకపోవడంతో రాకపోకలకు తీవ్రఇబ్బంది పడుతున్నారు. చిన్నారులు వృద్ధులు సైతం ఇంటిని వదిలి బయట రావడానికి భయపడుతున్నారు.

అధ్వానంగా పారిశుధ్యం..

ఇటీవల కురిసిన వర్షానికి గ్రామాల్లో అక్కడక్కడ వర్షపు నీరు నిలిచి పారిశుధ్యం అధ్వానంగా మారింది. పాత టైర్లలో వర్షపు నీరు నిలవడంతో దోమల లార్వాలు ఉత్పత్తి అయి దోమలు ఎక్కువగా వృద్ధి చెందుతున్నాయి. దీంతో రాత్రిపూట కంటిపై కునుకు లేకుండాపోతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమకాటు వలన ప్రజలు రోగాల భారినపడి ఆసుప్రతి పాలవుతున్నా సర్పంచ్ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

వెలగని వీధిలైట్లు

పంచాయతీలలో వీధిలైట్లు మరమ్మతులకు గురై నెలలు గడుస్తున్నాయి. అయినీ ఇప్పటి వరకు మరమ్మతు చేపట్టలేదు. సాయంత్రం పూట వీధిలైట్లు లేకపోవడంతో స్థానిక ప్రజలు ఆరు బయట రావడానికి భయపడుతున్నారు. గ్రామం చుట్టూ ముళ్లపదలు, చెట్లు ఉండటంతో విషసర్పాలు సంచారం ఎక్కువగా ఉందని ఏ క్షణములో విషసర్పాలు కాటు వేస్తుందో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఊరు మధ్యలో పేడదిబ్బలు దర్శనమిస్తున్నా వాటిని స్థానిక సర్పంచ్ తొలగించకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

నిధులు ఏమయ్యాయి..?

ఇటీవల గంగమాంబాపురం పంచాయతీకి సుమారు రూ.1.50లక్షలు నిధులు వచ్చాయి. అయితే అందులో పారిశుధ్యానికి ఖర్చు చేసినట్లు ఎక్కడ కనిపించలేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. అసలు ఆ నిధులు ఏమయ్యాయన్న సందేహం పంచాయతీలో ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తున్న స్థానిక సర్పంచులు వాటిని తప్పుదారి పట్టించి అవసరమైన పారిశుధ్య పనులు చేయకుండా నిధులను స్వాహా చేస్తున్నట్లు ఆరోపణ గట్టిగా వినిపిస్తున్నాయి. వీటిపై విచారణ చేపట్టి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎంపి చొరవతో

బ్రిడ్జి నిర్మాణానికి మార్గం సుగమం



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు చొరవతో గంగాధర నెల్లూరు నియోజకవర్గం, జీడి నెల్లూరు మండలం, చిన్నవెపంజేరి రెవెన్యూ శెట్టిఫారం గ్రామానికి సంబంధించి అండర్ బ్రిడ్జ్ నిర్మాణానికి మార్గం సుగమం అయ్యింది. గత మూడు సంవత్సరాలుగా చిత్తూరు జిల్లా జీడి నెల్లూరు మండలం, చిన్న వెపంజేరి రెవెన్యూ శెట్టిఫారం గ్రామప్రజలు అండర్ ప్యాసేజ్ ఫెసిలిటీ లేక తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటూ రాకపోకలు సాగించేవారు. ఈ నేపథ్యంలో తాము పడుతున్న ఇక్కట్లను చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాల్లో ఎవరైనా మృతిచెందితే. భౌతిక కాయాన్ని శ్మశాన వాటికకు తరలించేందుకు సరైన దారి లేక నరకయాతన అనుభవిస్తున్నాని ఎంపీకి మొరపెట్టుకున్నారు. చిత్తూరు -తచ్చూరు జాతీయ రహదారి (ఎన్‌హెచ్-716బి) తమ గ్రామానికి సమీపంలో ఉందని చెప్పారు. దీని పక్కనే వెయ్యి ఎకరాల సాగుభూమి ఉందనీ, అక్కడి చేరుకుని పొలం పనులు చేసుకునేందుకు కూడా వీలు లేకుండా పోయిందని వారి కష్టాలను వివరించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎంపి కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడంతో పాటు జాతీయ రోడ్డు రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని ఢిల్లీలో స్వయంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇందుకు తక్షణం స్పందించిన జాతీయ రోడ్డు రవాణా శాఖ చిన్న వెపంజేరి రెవెన్యూ శెట్టిఫారం గ్రామ అండర్ బ్రిడ్జ్ ప్యాసేజ్ సమస్యకు పరిష్కారమార్గాన్ని చూపడంతో పాటు, అండర్ బ్రిడ్జి ప్యాసేజ్ నిర్మాణానికి సంబంధించి అనుమతినిస్తూ ఎంపీకి సమాధానంగా లేఖ రాసింది దీంతో మూడేళ్ళ అండర్ బ్రిడ్జి ప్యాసేజ్ సమస్యకు పరిష్కారం లభించిందని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఎన్‌డిఏ ప్రభుత్వానికి, ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

క్రమశిక్షణతో చదవాలి: డీవైఈవో



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అంతర్జాతీయ స్వచ్ఛంద సేవకుల దినోత్సవం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చిత్తూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయిని దాక్షాయణి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చిత్తూరు ప్రాంతీయ ఉప విద్యాశాఖాధికారి చంద్రశేఖర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువులు అభ్యసిస్తూ విలువలు, మానవత్వం, సమానత్వం, సేవాగుణాలు అలవర్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. విశిష్ట అతిథి ప్రముఖ రచయిత్రి ఎంఆర్.అరుణ కుమారి, జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ రమేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే గురువులు, తల్లిదండ్రుల పట్ల భక్తిభావంతో, గౌరవ భావంతో మెలగాలని, ఆత్మస్థైర్యం, మనోధైర్యంతో ఉన్నత స్థితికి ఎదిగి సమాజసేవలో భాగస్వాములు కావాలన్నారు. రెడ్‌క్రాస్ కార్యదర్శి సహదేవ నాయుడు, కోఆర్డినేటర్ చిరంజీవి, 12 పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నిరాశ్రయులకు సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రత్యేక ఆయుర్వేదిక్ వైద్యశిబిరాలను నిర్వహించి వైద్యసేవలు అందిస్తున్నట్లు జోసెఫ్ రాజ్ తెలిపారు. శుక్రవారం చిత్తూరు నగరంలోని మెప్మా, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సపోర్ట్ సంస్థ నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతి గృహంలో ఆయుష్ శాఖ ప్రభుత్వ ఆయుర్వేదిక్ వైద్యశాఖ చిత్తూరు వారి సహకారంతో నిరాశ్రయులకు ఉచిత ఆయుర్వేదిక్ ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ హరిత, మురళీకృష్ణ, లక్ష్మీదేవి పాల్గొని వైద్య చికిత్సలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వసతి గృహ సిబ్బంది శశిరేఖ, శ్రీనివాస్ సెల్వి పాల్గొన్నారు.

రేపు మండల మీట్

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 7న శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10గంటలకు జీడీ నెల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అనిత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు వైస్ ఎంపీపీలు, జెడ్పిటిసి, సర్పంచులు పాల్గొనాలని కోరారు. అధికారులు ఆయా శాఖలకు చెందిన నివేదిక వివరాలతో హాజరుకావాలని ఆయన కోరారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు


అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో

ప్రజాశక్తి-తవణంపల్లి: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అధికారులు, సిబ్బందిని జెడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు హెచ్చరించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఉద్యోగరీత్యా నిర్లక్ష్యం వహిస్తే తగు చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

పన్ను వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి-విజయపురం(నగరి): పేరుకుపోయిన పన్నుల వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్‌ను మున్సిపల్ అధికారులు ప్రారంభించారు. మున్సిపాలిటీ ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు మున్సిపల్ పన్ను వసూలు సమస్యను పరిష్కరించేందుకు నడుం బిగించారు. కమిషనర్ కృష్ణారెడ్డి సిబ్బందితో పాటు వెళ్లి పన్ను బకాయిలు చెల్లించాల్సిన వారి ఇళ్ల వద్దకే వెళ్లి నివాసితులకు అవగాహన ఏర్పరచి పన్ను వసూలు చేసే ప్రక్రియను ప్రారంభించారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి-పెద్దపంజాణి: రాజుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల తల్లిదండ్రులు సలహాలు సూచనలు అవసరమని హెచ్ఎం నాగమల్లిక కోరారు. విద్యాశాఖ ఆదేశానుసారం ఈ నెల 7న శనివారం పాఠశాల ఆవరణంలో విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తప్పక పాఠశాల విద్యాభివృద్ధికి తల్లిదండ్రులు హాజరై సలహాలు, సూచనలు అందించాలని ఆమె కోరారు.

'ఈక్రాప్ బుకింగ్ చేసుకోవాలి'

ప్రజాశక్తి-విజయపురం: రైతులు పంటలకు ఈ క్రాబుకింగ్ చేసుకోవాలని వ్యవసాయ అధికారి కుమారి తెలిపారు. గురువారం పంచాయితీలో ఆమె వరి పైరును పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వరిలో ఆకు ముడత తెగులు ఉంటే ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పంటలకు ఇన్సురెన్స్ చెల్లించాలిని కోరారు. వరికి రూ.84, వేరుశనగకు రూ.60 చెల్లించాలని తెలిపారు.

రుచికరమైన ఆహారం వడ్డించాలి

ప్రజాశక్తి-పెద్దపంజాణి: విద్యార్థులకు రుచి శుభ్రతతో కూడిన నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలని వంటమ్మలకు ఎంపీడీవో బాలాజీ సూచించారు. గురువారం మండల పరిధిలోని పెద్దకాప్పల్లి, రాయల్‌పేట పాఠశాలలో ఈవోఆర్‌డి శారదాదేవితో కలిసి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. పాఠశాలలో నిర్మించిన టాయిలెట్లను పరిశీలించి విద్యార్థులు పరిశుభ్రత పాటించే విధంగా ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం రాయలపేట, కమ్మపాళ్యం, కోగిలేరు, ఎంపీడీవో, సూపరింటెండెంట్ భాస్కర్‌లు లింగాపురం సచివాలయాలను తనిఖీ చేసి సమయపాలన పాటించి తప్పకుండా సచివాలయ ఉద్యోగస్తులు ప్రజలకు అవసరమైన అన్ని సేవలు అందించాలని ఎంపీడీవో సూచించారు.

డీపీవోకు సన్మానం

ప్రజాశక్తి-వెదురుకుప్పం: గతంలో వెదురుకుప్పం ఎంపీడీవోగా భాధ్యతలు నిర్వహించి ఉద్యోగోన్నతిపై చిత్తూరు జిల్లా పంచాయతీ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన కె సుధాకర్ రావును ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది ఘనంగా సన్మానించారు. గురువారం వెదురుకుప్పం ఈవో పిఆర్‌డి ఎల్ పురుషోత్తం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు ఘనంగా దుశ్శాలువాలతో సత్కరించి, పుష్ప గుచ్ఛాని అందజేశారు.

సమస్యలకు పరిష్కారం చూపండి

- భాగ్యలక్ష్మి త్రిలోక్



ప్రజాశక్తి-కుప్పం టౌన్: పట్టణ పరిధిలో ఏపీ ఫైబర్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతూ భాగ్యలక్ష్మి త్రిలోక్ సీఎం చంద్రబాబుకు, ఏపీ ఫైబర్ అధ్యక్షులు బివి రెడ్డికి వినతి పత్రాన్ని అందించారు. గురువారం ఆమె సీఎంని, ఏపీ ఫైబర్ అధ్యక్షులను మర్యాదపూర్వకంగా కలిశారు.

నీట మునిగిన పంటల పరిశీలన

ప్రజాశక్తి-సోమల: ఫెంగల్ తుపాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు పంటలు నీట మునిగిన విషయం తెలిసిందే. ఆ పంటలను గురువారం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు పరిశీలించారు. దిడ్డివారిపల్లి, మఠం గొల్లపల్లి, గన్నువారిపల్లి గ్రామాల్లో పర్యటించి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సంధ్యారాణి, తిరుపతి వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు వసంత, హరిత, నాగమణి, గ్రామీణ వ్యవసాయ సహాయకులు వనజ, జ్యోతి పాల్గొన్నారు.



బుడిబుడి నడకలు.. బురదలో సాహసం!





సమదుస్తులు ధరించి.. భుజాన బడి సంచులతో.. అడుగులో అడుగులేస్తూ.. బురదలో సాహసయాత్ర చేస్తున్న ఆ చిన్నారులను చూశారా.. ఇందిరా నగర్‌కు వెళ్లే రోడ్డులో ఎంత ఇబ్బంది పడుతున్నారో.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు పూర్తిగా గుంతలమయమైంది. అధ్వానంగా ఉన్న ఈ దారిలో ద్విచక్ర వాహనాలు, పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బడికి వెళ్లాలంటే సాహసించాల్సి వస్తోందని, బురదలో నడవలేకపోతున్నామని ఆవేదనతో చెబుతున్నారు. ఈ విషయంపై ఇప్పటికే మున్సిపాలిటీ అధికారులు విన్నవించినా పట్టించుకోలేదని ఇందిరా నగర్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

- ప్రజాశక్తి-విజయపురం(నగరి)

క్రైం కార్నర్

కారు, బైక్ ఢీ

- ఒకరు మృతి, పలువురికి గాయాలు



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: కారు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా పలువురికి గాయాలైయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. పలమనేరు- కుప్పం జాతీయ రహదారిలోని కమ్మనపల్లి గ్రామ సమీపంలో ఇనోవా కారు బైక్ ఢీకొన్నాయి. బైక్‌లో ప్రయాణిస్తున్న శరణ్ అక్కడికక్కడే మృతి చెందారు. చిత్తూరు నుంచి సబరిమల అయ్యప్ప స్వామి దర్శనానికి వెళ్తున్న 6మందికి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఇది తెలుసుకున్న స్థానిక ఎస్ఐ పరశురాముడు సంఘటన చేరుకొని శరణ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

భూమిని కాపాడితే భావితరాలకు ప్రయోజనం



ప్రజాశక్తి-పుంగనూరు: సేంద్రియ ఎరువులు వాడడం ద్వారా భావితరాలకు భూమి వల్ల ప్రయోజనాలు పొందవచ్చునని వ్యవసాయ శాఖ సంచాలకులు శివకుమార్ అన్నారు. ప్రపంచ మృతిక దినోత్సవం సందర్భంగా మండలంలోని చదళ్ల గ్రామంలో రైతు సేవా కేంద్రంలో కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు నేలను సేంద్రీయ ఎరువులు పచ్చ రొట్ట ఎరువులు వాడకం ద్వారా భూమిని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు అని అన్నారు. సేంద్రీయ ఎరువులు వాడడం ద్వారా నేలలో సేంద్రీయ కర్బనం పెరుగుతుందని దీని ద్వారా నేలలో తేమను ఎక్కువ రోజులు నిల్వ ఉంచుకునే సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు. రసాయనక ఎరువులు వాడడం ద్వారా నేలలు నిస్సారమైన కోతకు గురి అవుతుందని నేల కాలుష్యం పెరుగుతుందని చెప్పారు. ఇలాంటి నేలలు పండించిన పంటలు కూడా విషపూరితంగా తయా రవుతాయని తెలిపారు. రైతులు నేలను కాపాడు కోవడం ద్వారా భావితరాలకు ప్రయోజనకరంగా ఉంటాయన్నారు. అనంతరం ఫెంగల్ తుపానులో నష్టపోయిన వరి పంటను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని జ్యోతి, ఆనంద్, శాస్త్రవేత్త సంధ్యారాణి, రైతులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు జాతీయస్థాయి గుర్తింపు



ప్రజాశక్తి-పూతలపట్టు: ఇటీవల ఏపీ మాస్ సంస్థ నిర్వహించిన సర్వేలో పూతలపట్టు, తవణంపల్లి మండలాలకు సంబంధించిన మహిళా సంఘాలు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయి. మహిళ సంఘాలు, మహిళా రైతులు నిర్వహిస్తున్న ఆర్థిక లావాదేవీలపై ఈ సమస్త సుదీర్ఘ వివరాలను సేకరించింది. పూతలపట్టు నియోజకవర్గంలో రెండు మండలాలు జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన సందర్భంగా గురువారం పూతలపట్టు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అభినందన సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మురళీమోహన్, డిఆర్డిఏ ఇన్‌ఛార్జ్ పీడీ శ్రీదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో పూతలపట్టు నియోజకవర్గం అభివృద్ధిని జాతీయస్థాయిలో చాటిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం మహిళ అభివృద్ధికి మరింత దోహదపడడానికి సిద్ధంగా ఉందని అధికారులు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నడపడానికి సంసిద్ధులు కావాలని పిలుపునిచ్చారు. ఇందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి తాను సిద్ధంగా ఉన్నట్టు చెప్పుకొచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగరాజు, ఎంపీపీ కుమారి, జెడ్పిటిసి దేవిక, ఏపీఎం సింగన్న మరి కొంతమంది అధికారులు పాల్గొన్నారు.

త్యాగరాజుకు డాక్టరేట్



ప్రజాశక్తి-కుప్పం టౌన్, గుడిపల్లి: ద్రావిడ విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థి త్యాగరాజకు డాక్టరేట్ ప్రదానం చేసినట్టు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య ఎం దొరస్వామి తెలిపారు. సాంప్రదాయ తమిళ సాహిత్యం ద్వారా వెల్లడి చేయబడిన తమిళుల మతపరమైన స్థితి అనే అంశంపై త్యాగరాజు చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ పట్టాను ప్రదానం చేస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు గురువారం ఉపకులపతి త్యాగరాజుకు డాక్టరేట్ పట్టాను అందించడం జరిగింది. ఇతను ఆచార్య ఆర్ వివేకానంద గోపాల్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్టు తెలిపారు. డాక్టరేట్ పట్టా పొందిన త్యాగరాజను తమిళ శాఖ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

ఘనంగా ప్రపంచ ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవం


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంఈవో

ప్రజాశక్తి-కార్వేటినగరం: కార్వేటినగరంలో ప్రతిభావంతుల దినోత్సవాన్ని గురువారం భవిత కేంద్రంలో ఎంఈవో విజయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పిల్లల తల్లిదండ్రులకు భవిత కేంద్రంలోని జరుగుతున్న సేవలు గురించి తెలియపరుస్తూ, పిల్లలను భవిత కేంద్రాలకు పంపించాలని పిలుపునిచ్చారు. ప్రతిభ కనపరిచిన వారిని అన్ని రంగాలలో దివ్యంగుల పిల్లలకు ప్రభుత్వం మొదటి స్థానం కల్పిస్తుందన్నారు. ఎంఈవో 2 మనోజ్ కుమార్ మాట్లాడుతూ అంగవైకల్యం శరీరానికి కానీ మనసుకు కాదన్నారు. దివ్యాంగులకు సరైన పద్ధతుల సౌకర్యాలు అందించినట్లయితే మరింత ఉన్నత స్థాయికి ఎదుగుతారని తెలిపారు. పలువుర చేతుల మీదుగా పిల్లలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో యూపీ ఉర్దూ హెచ్ఎం ఎస్ మేజహారున్నిసా భేగాం, మెయిన్ పాఠశాల హెచ్ఎం యశోద, సీఆర్పీలు కార్తీక్, మీనా, ధనంజయలు, సింధుజ, రేఖ పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కళోత్సవ పోటీలకు కార్వేటినగరం విద్యార్థులు



ప్రజాశక్తి-కార్వేటినగరం: జిల్లా విద్యాశిక్షణా సంస్థ(డైట్)లో గురువారం నిర్వహించిన జిల్లా కళోత్సవ పోటీల్లో కార్వేటినగరం, పుత్తూరు విద్యార్థులు సత్తాచాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని డైట్ అధ్యాపకులు దేవప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ డైట్ కళాశాలలో 4, 5వ తేదీలో రెండు రోజుల పాటు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి వచ్చిన 9 నుంచి 12వ తరగతి వరకు విద్య నభ్యసించే ప్రభుత్వ, రాష్ట్ర స్థాయి కళాఉత్సవ ఎంపిక పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఇందులు ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొదటి బహుమతి రూ.25వేలు, ద్వితీయ బహుమతి రూ.20వేలు, అలాగే తృతీయ బహుమతి రూ.15వేలు అందించడం జరుగుంతుందన్నారు.

- విజేతలు వివరాలిలా..

ఓకల్ మ్యూజిక్‌ల్లో మొదటి స్థానంలో పుత్తూరు బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన వి.తన్మయ అదేవిధంగా ద్వితీయ స్థానంలో కార్వేటినగరం బాలికల ప్లస్ ఉన్నత పాఠశాలకు చెందిన గాయత్రీ, తృతీయ స్థానంలో అదే పాఠశాలకు చెందిన పూజిత గ్రూపు దక్కించుకుంది. అలాగే ఇన్స్ట్రుమెంట్ మ్యూజిక్ పోటీల్లో పుత్తూరు బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన మౌనిక, డ్యాన్స్ పోటీలో మొదటి బహుమతికి శరణ్య గ్రూపు, రెండవ బహుమతి మహేశ్వరీ గ్రూపు జెడ్పీ హైస్కూల్ పుత్తూరు వారు దక్కించుకున్నారు. అలాగే థియాటర్ నందు భార్గవి గ్రూపుకు మొదటి బహుమతి పొందడం జరిగింది. విజ్యువల్ ఆర్ట్స్ పోటీలో జెడ్పీహైస్కూల్ పుత్తూరు విద్యార్థిని యోగిత కైవసం చేసుకుంది. ట్రెడిషినల్ ఆర్ట్స్‌లో పచ్చికాపల్లం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన భార్గవి గ్రూపు విజేతలుగా నిలిచారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొంది రాష్ట్ర కళాఉత్సవ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు మెమెంటోలు అందించారు. కార్యక్రమంలో డైట్ అద్యాపకులు నిర్మలాదేవీ, అనిత, బోధనేతర సిబ్బంది కృపావతి, పురుషోత్తం, విద్యార్థుల తల్లిదండ్రులు పలువురు పాల్గొన్నారు.

ఒంటరి ఏనుగు స్వైర విహారం

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు రూరల్ మండలంలోని మొసలి మడుగు గ్రామ సమీపంలోని బండమీద ఇండ్లు గ్రామానికి చెందిన విజయన్ అనే రైతుకు చెందిన వ్యవసాయ భూములు చెరువు పక్కన గల అటవి సమీపాన ఉన్నాయి. తన వ్యవసాయ భూమిలో ఇల్లు నిర్మించుకుని అందులో తన భూమీలోని వరి పంటను కోత కోసి వరి ధాన్యాన్ని ఇంటిలో ఆరబెట్టి పనిమీద బయటకు వెళ్ళాడు. ఈ నేపథ్యంలో బుధవారం అర్ధ రాత్రి ఓ ఒంటరి ఏనుగు వచ్చి సమీప వ్యవసాయ భూముల్లోనికి ప్రవేసించి కొంతమందికి చెందిన పలురకాల పంటలను తిని కాళ్ళతో తొక్కి నష్టపరచింది. వ్యవసాయ భూమిలోని ఇంటిపై దాడిచేసి ఇంటి తలుపులను కిటికీలను పగులగొట్టి ఇంటిలో పలకు ఏనుగు తొండంతో వరి ధాన్యాన్ని కావలసినంత ఆరగించి తరువాత అడవిలోకి వెళ్ళిపోయింది. తరువాత గురువారం ఉదయం అక్కడున్న రైతులు పొలాలకు వెళ్లి నష్టమైన పంటలను చూసి అవాక్కయ్యారు. ఈ విషయాన్ని అటవి శాఖ అధికారులకు తెలియపరచి పెంగరగుంట బీట్ ఆఫీసర్ తిరుపతయ్య, సెక్షన్ ఆఫీసర్ సుకుమార్ ఇరువురు వచ్చి పంటలను, ధ్వంసం చేసిన ఇంటిని పరిశీలించి ఫోటోలు తీసుకుని వెళ్ళారు. అక్కడున్న రైతులు వారితో మా పంటపొలాలను ప్రతినిత్యం ఏనుగుల దాడులు ఎక్కువైయ్యాయనిచర్యలు చేపట్టాలని కోరారు.

క్రమం తప్పకుండా మందులు వాడాలి

- డాక్టర్ సోమశేఖర్

ప్రజాశక్తి-విజయపురం: ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు షుగర్ బీపీ అధికంగా ఉందని డాక్టర్ సోమశేఖర్ అన్నారు. గురువారం జగన్నాథపురంలో నిర్వహించిన 104 వాహనం వద్ద డాక్టర్ సోమశేఖర్ గ్రామసులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు షుగర్ బీపీ పట్టణాలు మాత్రమే కనిపించేదని ప్రస్తుతం అది గ్రామస్థాయిలో ఎక్కువగా ఉందని అన్నారు. దీనికి ప్రధాన కారణం ఆహార అలవాట్లు వ్యాయామం లేకపోవడం సరైన పౌష్టికాహారం తీసుకుపోవడం అని ఆయన పేర్కొన్నారు. షుగర్, బీపీతో బాధపడేవారు ప్రతిరోజు క్రమం తప్పకుండా మందులు వాడాలని, వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో యంపింహెచ్ఎస్ మురళి, ఎంఎల్ హెచ్ పి శివగామి, ఏఎన్ఎం పద్మావతి,104 డిఈవో కుమారేష్, ఆశ వర్కర్ కుమారి, జ్యోతి పాల్గొన్నారు.

దర్గా నిర్మాణానికి సహకరించండి



ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని పెద్దపంజాణి పంచాయతీ పంజాణి సత్రంలో దర్గా, శ్మశాన వాటికకు ప్రహరీ గోడ నిర్మాణానికి సహకరించాలని గురువారం ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డిని కోరినట్లు పంజాణి ముస్లింలు మాజీ ఎంపిటిసి ముబారక్ తాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో ముబారక్ తాజ్ ఆధ్వర్యంలో ముస్లింలు ఆయన్ని సన్మానించారు. ఎన్నికల ముందు వారికి ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యేని కలిసినట్లు తెలిపారు. అనంతరం వాటి నిర్మాణానికి తప్పకుండా చేయూత అందిస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన మండల మైనారిటీ అధ్యక్షులు అజీమ్ తాజ్, నజీం తాజ్, మండల మైనారిటీ కన్వీనర్ నవాజ్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కూలడానికి సిద్ధంగా విద్యుత్ స్తంభం

- పట్టించుకోని అధికారులు



కూలడానికి సిద్ధంగా ఉన్న స్తంభం

ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని గంగవరం పంచాయతీ నల్లగుట్లపల్లి గ్రామం నడిబొడ్డున విద్యుత్ స్తంభం పూర్తిగా పాడైపోయింది. కూలడానికి సిద్ధంగా ఉంది. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని గ్రామస్తులు అంటున్నారు. విద్యుత్ వైర్లు పక్కనే ఉన్న చెట్లకు తగులుతూ ఉండడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనేక సార్లు ఈ విషయంపై విద్యుత్ అధికారులకు తెలియజేసినా ప్రయోజనం లేకపోయిందని మండిపడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

నెట్ సెంటర్లు తనిఖీ

ప్రజాశక్తి-రామకుప్పం: మండలంలోని నెట్ సెంటర్ల నిర్వాహకులు నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలను సృష్టిస్తున్నారని స్థానిక ప్రజలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం అధికారులు నెట్ సెంటర్లో తనిఖీలు చేశారు. నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలపై కొందరు కుప్పం ఆర్డీఓ శ్రీనివాసరాజుకు ఫిర్యాదు చేశారు. సాయంత్రం ఆయనతో పాటు తహశీల్దారు బాబు, ఎంపీడీఓ లక్ష్మీకాంత్‌తో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మండలంలోని రామకుప్పంలో ఉన్న నెట్ సెంటర్, వీర్నమలలో నెట్ సెంటర్లలో ఇటీవల నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలను తయారు చేసి ప్రజలకు అందించినట్టు తనిఖీల్లో గుర్తించారు. ఈ వ్యవహారంపై ప్రాథమికంగా తమకు ఆధారాలు ఉన్నాయని తహశీల్దారు తెలిపారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నిర్వహకులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

హార్టికల్చర్‌లో ముగిసిన శిక్షణా కార్యక్రమం


విలేకరులతో ప్రసంగిస్తున్న హార్టికల్చర్ అధికారులు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: కూరగాయలలో అంటు కట్టు విధానము, సాగు విధానంపై మూడు రోజులు పాటు 2 రాష్ట్రాలకు చెందిన దాదాపు 40మంది విద్యార్థులు, అధికారులకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కుప్పంలో శిక్షణ ఇవ్వడం జరిగినది. మూడో రోజు అయిన గురువారం ఈ శిక్షణ కార్యక్రమం ముగిసింది. అధికారులు అందరూ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో సాగవుతున్న హైబ్రిడ్ బంతిపూల విత్తన తయారీ, అంటుకట్టిన వంగ మొక్కలో తోటలను రూట్ స్టాక్‌కు వాడుకుని మొక్కల బ్లాకును సందర్శించారు. తదుపరి కోతారీ కంపెనీ, కేఎఫ్ బయోటెక్నాలజీ, కంపెనీ వారు మల్చింగ్ విధానం బయోటెక్నాలజీ మొక్కల పెంపకం నేటాఫేమ్ కంపెనీ వారు బిందు సేద్యం ద్వారా ఎరువులు, నీటి యాజమాన్య పద్ధతుల గురించి తెలియపరిచారు. ఈ శిక్షణకు హాజరైన అధికారులు స్పందిస్తూ ఇటువంటి అధునాతన విధానంపై శిక్షణ ఏర్పాటు చేసి నందుకు ఇజ్రాయిల్ దేశానికి చెందిన ఇండో ఇజ్రాయిల్ ఎంబస్సే న్యూఢిల్లీ అగ్రికల్చర్ అటాచి (ప్రతినిధి) ఉరీ రుబీన్ స్టీన్, ఇండో ఇజ్రాయిల్ న్యూఢిల్లీకి చెందిన ప్రాజెక్ట్ ఆఫీసర్ బ్రహ్మదేవ్, ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి బాల సుబ్రహ్మణ్యం, హార్టికల్చర్ ఏడి కోటేశ్వరరావుకు ధన్యవాదాలు తెలిపారు.

జాబ్ మేళాకు విశేష స్పందన


జాబ్ మేళాలో పాల్గొన్న నిరుద్యోగ యువత

ప్రజాశక్తి-కుప్పం టౌన్: పట్టణంలోని టిడిపి కార్యాలయంలో నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. గురువారం ఏపీ నైపుణ్య శిక్షణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం హాజరయ్యారు. నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున చేరుకున్నారు. 15పరిశ్రమల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 256 మంది యువత పాల్గొనగా 127మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందాలు. కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు డాక్టర్ వెంకటేష్, కన్నన్, సత్యేంద్ర శేఖర్, వేలు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైకల్యం శరీరానికే మనసుకు కాదు

- ఎంఈవో శ్రీదేవి


బహుమతులు అందజేస్తున్న ఎంఈవో

ప్రజాశక్తి-విజయపురం(నగరి): వైకల్యం శరీరానికే ఉంటుంది కానీ మనసుకు ఉండదని ఎంఈవో శ్రీదేవి అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని నగరి మండలం భవిత కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. విద్యార్థులకు డ్రాయింగ్, ఆర్ట్ మొదలగు పోటీలను నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈవో మాట్లాడుతూ వైకల్యం శరీరానికే గాని మనసుకు ఉండదన్నారు. ఆత్మవిశ్వాసంతో వైకలల్యాన్ని జయించవచ్చున్నారు. స్టీఫెన్ హాకింగ్, నిఖిల్ బోజస్, లూయి బ్రెయిలీ, హెలెన్ కెల్లర్ తదితరులు దీనికి ఉదాహరణగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఎంఈవో -2 నమశ్శివాయం, హెచ్ఎం పార్వతి, భవిత కేంద్రం ఉపాధ్యాయులు భవాని, సంతోష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను అడ్డుకున్న టీడీపీ నేతలు

- సమాచారం ఇవ్వలేదని అధికారులపై ఆగ్రహం
- గతంలో జరిగిన పనులను రీఅడిట్ చేయాలని డిమాండ్
- సామాజిక తనిఖీ బహిరంగ సభను వాయిదా వేసిన పీడీ

ప్రజాశక్తి-శాంతిపురం: ఉపాధి హామీ చట్టం 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమాన్ని టీడీపీ మండల అధ్యక్షులు విశ్వనాథ నాయుడు, పలువురు నేతలు అడ్డుకున్నారు. గురువారం శాంతిపురం ఎంపీడీవో కుమార్ అధ్యక్షతన డ్వామా పీడీ రవికుమార్ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. మండలంలో 2023-24 గానూ ఉపాధి హామీ చట్టంతో పాటు పలు సంక్షేమ పథకాల సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం ప్రజలు, ప్రజా ప్రతినిధులు హాజరు కాకుండా తుతూమంత్రంగా ఎలా సామాజిక తనిఖీ సభను నిర్వహిస్తారని పలువురు నాయకులు నిలదీశారు. సామాజిక తనిఖీకి సంబంధించి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఏ విధంగా తనిఖీలు చేశారని ప్రశ్నించారు. నిబంధనల ప్రకారం సామాజిక తనిఖీలు చేపట్టబోయే ముందు అధికారులు, ప్రజా ప్రతినిధులు, సామాజిక తనిఖీ సిబ్బంది కోఆర్డినేషన్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ప్రతి పంచాయతీలను గ్రామసభలు నిర్వహించి ఆయా పంచాయతీలలో చేసిన పనులను పరిశీలించి, లబ్ధిదారులను విచారించాలన్నారు. ఇందుకోసం గ్రామాల్లో దండోరా వేయించాల్సి ఉందన్నారు. ఈ నిబంధనలన్నీ వదిలేసి ఫీల్డ్ అసిస్టెంట్లతో కుమ్మక్కై తూతూ మంత్రంగా తనిఖీలున్న చేపట్టారని వారు ఆరోపించారు. ఈ సందర్భంగా పలు పంచాయతీలకు చెందిన క్షేత్ర సహాయకులు చాలా వరకు అవకతవకలు జరిగాయని, కాబట్టి ఈ సమావేశాన్ని వాయిదా వేసి ప్రజలు ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో ఈ సమావేశాన్ని మరల ఏర్పాటు చేయాలని అధికారులపై ఒత్తిడి తీసుకుని వచ్చారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పరిస్థితి చక్కబడకపోవడంతో పీడీ రవికుమార్ బహిరంగ సభను వాయిదా వేస్తూ మరో రోజు నిర్వహించడానికి ప్రకటిస్తామని తెలిపారు.

